

TALKIES

*ప్రపంచంలో అంతులేని అన్యాయం అక్రమం అవినీతి పేరుకొని ఉన్నాయి. హృదయం ఉన్న మనిషి, ఆలోచించే శక్తి గలవాడు ఎన్నటికీ సహించలేడు. ఎదురు తిరిగి ఈలాంటివన్నీ నిశ్శేషంగా నిర్మూలించాలనుకొంటాడు. ఇందుకు ప్రథమ సోపానం ఏమిటో నిర్ణయించుకోవాలి గదా!*

మునిమాపువేళ కాబోతున్నది. సాధారణంగా సాయంకాలం ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే ఏదో చదువుతూ కూర్చోటం మూర్తి కలవాటు. ఆ పత్రికమూ ఈ పుస్తకమూ కాసేపు తిరగేసి, ఏది చదవ బుద్ధికాక విసుగ్గా కుర్చీలోంచి లేచాడు మూర్తి. ఆ మర్నాడు ఆదివారం అని అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది. దాంతో అతని విసుగుదల ద్విగుణీకృతమైంది. ఆదివారం అతనికో సమస్య. ఆ సమస్య శనివారం సాయంకాలమే ప్రారంభం కావటం మామూలే. సమస్య పరిష్కారం గురించి ఆలోచిస్తుండగా గాలికి పేపరు రెపరెలాడి రివ్వున అతని కాళ్ళముందు పడింది. తీసి మడతపెడుతూ యథాలాపంగా పేపరు వైపు చూశాడు మూర్తి. ఆకర్షణీయమైన ఒక ప్రకటన అతని దృష్టిని ఆకట్టింది.

# ప్రేక్షకుడు

ఏదో కొత్త చిత్రం ఆ రోజే విడుదల చేస్తున్నారు. మంచి కాలక్షేపమే ననుకున్నాడు మూర్తి. అనుకోటమే తడవుగా, దుప్పటి వేసుకొని బయలుదేరాడు.

గడప దాటాడో లేదో, "దొంగ, దొంగ పట్టుకోండి" అనే అరుపులు విని చకితుడై వెనక్కు తిరిగి చూశాడు మూర్తి. ఎవరో తన వైపు పరుగెత్తుకు వస్తున్నారు. ఒక వ్యక్తి తనను దూసుకుపోయాడు. అతన్ని తరుముతూ మరికొంతమంది పరుగెత్తి చివరికి అతన్ని పట్టుకున్నారు. మూర్తి నెమ్మదిగా నడిచి ఆ గుంపు దగ్గరికి వెళ్ళాడు. దొంగతనం ఆరోపించబడిన వ్యక్తిని చితకగొడుతూ దుర్భాషలాడుతున్నారు జనం. అసలు సంగతేమిటో అతనికి తెలియ లేదు.

"పోలీస్ స్టేషన్‌కి తీసుకువెళ్ళండి" అని సలహా ఇచ్చారు ఎవరో.

మూర్తికి జాలివేసింది. పాపం, కొట్లో పెడతారు కాబోలు ననుకున్నాడు. కాని అదే నయమనిపించిం దతనికి. ఇంకా కాసేపు దెబ్బలు తగిలితే ఆ వ్యక్తి బతికేదాకా నమ్మకం లేదు. ఆ ఊహ కలగగానే అతనికి జనంమీద కోపం వచ్చింది. దొంగతనం చేస్తే పోలీసు వాళ్ళకు చెప్పటం భావ్యం. అంతేగాని అతనిమీద చెయ్యి చేసుకోటానికీ, నోటికి వచ్చినట్టు తిట్టటానికీ వాళ్ళ కేం అధికారం ఉంది? పాపం, ఆ వ్యక్తి ముఖం దించుకుని అన్నీ సహిస్తూ ఊరుకుంటున్నాడు. ఈ మనుషులకు జాలి కలగదేం! ఒక్కడంటే ఒక్కడూ "పోనీ, పాపం" అనడు కదా!

మూర్తికి దొంగమీద సానుభూతీ, జనం మీద అసహ్యమూ కలిగాయి. పరిస్థితులు ఎదురు తిరిగితే, ఈ వ్యక్తుల్లో ఎంతమంది నీతిరేఖ దాటకుండా ఉండగలరు! ఏ పరిస్థితుల్లో అతను దొంగతనానికి ఒడికట్టాడో ఎవరూ విచారించరేం?

మూర్తి ఇలా ఆలోచిస్తూండగానే జనం దొంగగా పట్టుకోబడ్డ ఆ వ్యక్తిని పోలీసు స్టేషన్‌వైపు తోసుకుంటూ సాగిపోయారు.

మూర్తి ముందుకు నడిచాడు. అతనికి కొంచెం దగ్గర్లో ఓ రిక్షా ఆగింది. అందు లోంచి ఒక దీర్ఘకాయుడు దిగి రిక్షావాడి చేతిలో చిల్లర డబ్బులు పెట్టాడు. రిక్షావాలా చిల్లర లెక్క చూసుకుని తెల్లబోయాడు.

"పావలా ఇస్తారేం బాబూ?"

"ఎంతివ్వాలి?"

"ఆరణాలు ఒప్పుకున్నారుగా బాబూ?"

"ఆరణాలకు ఎప్పుడైనా స్టేషన్‌నుంచి కట్టావా?"

"గిరాకీ, దాని కేంటి బాబూ?"

"మోసం చేద్దామనుకున్నావా? ఎవరి ననుకున్నావ్?"

"మోసం ఏటి బాబూ, ఒప్పుకున్న బాడిక్కి?"

"ఎవ డొప్పుకున్నాడోయ్?"

"మాట తకరారు రానీబోకండి, పెద్దోరు."

"నే నివ్వను ఫో."

"మా గొప్ప పెద్దమడిసే. ఇదీ కూడా మీరే దాచుకోండి."

రిక్షావాడు కోపంగా చిల్లర డబ్బులు వాపసు తీసుకోమన్నట్టుగా అతనివైపు చెయ్యి చాపాడు. డబ్బులు జారి కిందపడ్డాయి. ఆ వ్యక్తి కళ్ళెఱ్ఱజేసి, నిర్లక్ష్యంగా ముందుకు పోబోయాడు.

"ఏమండోయ్."

అతను వినిపించుకోలేదు. రిక్షావాలా గబ గబ అంగలువేసి అతని చొక్కా చివర పట్టుకున్నాడు. అతను ఊచి పుచ్చుకుని అతని చెంప మీద ఫెళ్ళున కొట్టాడు. రిక్షావాలా అతని చెయ్యి పుచ్చుకున్నాడు. జనం గుంపుగా చేరారు. ఇదంతా చూస్తూ మూర్తి ఆశ్చర్యంగా అలాగే నిలబడ్డాడు. రెండణాలకోసం ఆ వ్యక్తి అలా ఎందుకు పరువు పోగొట్టుకుంటున్నాడో అర్థం కాలే దతనికి.

"అబ్బో, రిక్షావాళ్ళు రిక్షావాళ్ళా ఈ రోజుల్లో!" ఎవరో సిఫార్సు చేశారు.

"తలపొగరు. తనంతర మేమిటో తెలుసు కోకుండా చొక్కా పట్టుకుంటాడా రాస్కెల్"

'హితశ్రీ'

## ఆశా సంగీతం

సి. నారాయణరెడ్డి

నా యింటికి మింటికి సం
ధాన సూత్రమై నిల్చెను
ఎదో చైతన్య తరంగము
ఎదిగిన తేజశ్శృంగము.


కుళ్ళు గుంటలన్ని పాల
మళ్ళై; కత్తులను పొదుగు
కొన్న యిరుల ఒరలు పూల
గూళ్ళై మిరుమిట్లు గొల్పె.

నెలల కొద్ది మంచులోన
నిలబడి కంపించు మొరడు
మొగములపై మ్రోసె లేత
చిగుళ్ళ మంటల పల్లవి.

గడ్డి గరచుకొని పడున్న
గ్రుడ్డి పూలు శ్రీవతుని
పారిజాత మాలకు సరి
బంతిలో విరాజిల్లెను.

బురదలోన బ్రతికే కు
మ్మరి పురుగులు గూడ నేడు
తుమ్మెదలై గులాబీల
తో వియ్యమ్మందు కొనెను.

ఈ నాటికి బిచ్చకత్తె
యైనా మాన్య శ్రీమతి.
చెమట వడిపి కట్టిన ప్రతి
చీకు గుడిసె అమరావతి.




హరిణేక్షణ    చిత్రం—కాటూరి కృష్ణమూర్తి (నూతక్కి)

# ప్రేక్షకుడు

"తప్పండి వెధవని."

తలో మాటా అంటున్నారు జనం. ఫెడీ ఫెడీ దెబ్బలు వినిపించి ఆలోచనల్లోంచి ఊడిపడ్డాడు మూర్తి. కొంతమంది పెద్దలు రిక్షా వాడిని సున్నంలోకి ఎముక లేకుండా చేశారు. మూర్తికి జాలివేసింది. తప్పు ఆ పెద్దమనిషి భుజస్కంధాలమీద తడిసిన పచ్చి గడ్డిలా మోపెడు కావటం తను ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాడు. ఎవరూ ఆ సంగతి పట్టించుకోరేం? ప్చ్, ప్రపంచం తీరు!

"ఏయ్ రిక్షా."

రిక్షా సెంటర్లో నిలబడి ఉండటంవల్ల, కాన్‌స్టేబుల్ దూరంనుంచి కేకవేశాడు. కూడలిలో రద్దీగా ఉండటంవల్ల జనం గుంపుగా జేరటం చూసి కూడా అతను కల్పించుకోలేకపోయాడు. కాన్‌స్టేబిల్ కేకవిని తీవ్రవాదులు కొంతమంది చెట్టొక పిట్టగా జారుకున్నారు.

మూర్తి రిక్షావాలామీద పూర్తి సానుభూతితో జాలిపడుతూ ముందుకు సాగాడు.

ఎదురుగా ఏదో ఊరేగింపు వస్తూంది.

"కేరళ వరద బాధితుల సహాయార్థం ధర్మం చెయ్యండి." డబ్బాలు పట్టుకుని కుర్రవాళ్ళు ఊరేగింపుగా బయల్దేరి అందర్నీ ధర్మం అడుగుతున్నారు. ఆ దృశ్యం చూసేసరికి మూర్తి మనసులో పెరియార్ నది ఉప్పొంగిపోతూ కనిపించింది. మునిగిపోయే మనుషులూ, పశువులూ, ఇళ్ళూ అతని మనోవీధిలో ప్రత్యక్షం కావటంతో అతని హృదయం కరుణార్ద్రమైంది. కుర్రవాళ్ళు మంచి పనే చేస్తున్నారని లోలోపలే మెచ్చుకున్నాడు. కాని డబ్బాల్లో ఎక్కువమంది ధర్మం వెయ్యటం లేదు. సవిలాసంగా కబుర్లు చెప్పుకుంటూ, ధర్మం అడిగే కుర్రవాళ్ళను నిర్లక్ష్యంగా తోసుకుపోతున్నారు జనం. ఖరీదైన దుస్తుల్ని వేసుకుని, తోటి మానవుల బాధల్ని గురించి ఏమీ పట్టించుకోకుండా, నిర్దయగా డబ్బాల్ని నెట్టేస్తున్న విలాస పురుషుల స్వార్థపరత్వానికి అతనికి కోపం వచ్చింది. లోకమంతా లోభులతో నిండి ఉందని మనసులో లోకాన్ని నిందించాడు. ఆ కుర్రవాళ్ళు ఎవరూ తనను ధర్మం అడగరేం? రిక్షాలూ, బళ్ళూ, మనుషులూ అడ్డం వస్తూ తనను మరుగుపరచటంవల్ల వాళ్ళెవరూ తనను గమనించినట్టు లేదు. ఊరేగింపు క్రమంగా తనను దాటిపోయింది. ఆ ఊరేగింపు వరదల కల్లోలాన్ని గుర్తు చేయటంవల్ల మూర్తి మనసు వికలమైంది. ప్రకృతి కూడా మనిషిమీద తిరగబడిందని మూర్తికి ఉక్రోషం కలిగింది. ఆలోచనలతో మనసు వేడెక్కటంవల్ల మూర్తి ఆలోచించటం మానేసి వచ్చే పోయే జనాన్ని చూస్తూ కాఫీ హోట

ళ్లో దూరాడు. హోటల్ కిటకిటలాడి పోతూంది. ఎక్కడా జాగాలేదు. మూర్తి వెనక్కు తిరిగాడు.

"లోపలికి పొండి సార్" అన్నాడు కౌంటర్‌లో కూర్చున్న గుమాస్తా.

మూర్తి యాంత్రికంగా లోపలికి వెళ్ళాడు. రద్దీగా ఉన్న సమయాల్లో ఆ హోటల్లోని వంట గదిలోకి పోయి నిలబడి కాఫీ తాగిరావటం జనానికి అలవాటే.

లోపలికి వెడుతూ మూర్తి యథాలాపంగా పక్క గదిలోని దృశ్యాన్ని ఓరగా వేసిన తలుపుల సందునించి చూసి ముఖం చిట్లించుకున్నాడు.

"తమరు దయుంచాలి."

హోటల్ ప్రొప్రయిటర్ ప్రాదేయపూర్వకంగా బలవంతాన ప్రభుత్వోద్యోగపు దుస్తుల్లో ఉన్న వ్యక్తి జేబును యథోచితంగా పారితోషికంతో అలంకరిస్తున్నాడు.

ఆ బలవంత మేదో పై పై బలవంతమేనని మూర్తికి తెలుసు.

"ఏం కావాలి సార్?"

"కాఫీ."

కాఫీ రాగానే, ఆ గుక్కెడు నీళ్ళూ గొంతులో పోసుకుని, బిల్లు చెల్లిస్తూ కౌంటర్ దగ్గర కూర్చున్న కొత్త వ్యక్తిని చూశాడు మూర్తి. ఆఫీసరుగారి గుమాస్తా కాబోలు పాపం, శ్రమను సరకు చేయకుండా బిల్లులన్నీ లెక్క చూసుకుంటున్నాడు. బిల్లు చెల్లించి మూర్తి బయటపడ్డాడు.

తను చెల్లించిన బిల్లు ఎలాగూ లెక్కలోకి రాదు. అలాగే ఎన్ని బిల్లులో లెక్కకురావు. తనెన్నిసార్లు బిల్లు లేకుండా వస్తువులు కొనలేదు!

ఈ ఆఫీసర్‌పైన చాలామందికి పిటీషన్లు పెట్టారట. పెట్టరూ, మరి? తను చూసిన దృశ్యాల్లాంటివి ఎన్నింటిని ఎంతమంది చూశారో!

వందలకు వందలు జీతాలు పుచ్చుకుంటూ కక్కూర్తి సంపాదనకు అలవాటుపడిన ఉద్యోగుల ప్రవర్తనను ఏహ్యభావంతో విమర్శించాడు మూర్తి మనసులో. దేశం బాగుపడాలంటే ప్రజలు ఇలాంటి ఉద్యోగుల ఆటల్ని తమ శాయశక్తులా అరికట్టాలని గట్టిగా అనుకున్నాడు మూర్తి.

"దేనికైనా ప్రజలు ముందుకొస్తే గదా, దేశానికి మోక్షం" అని అభిప్రాయపడ్డాడు.

మసక మసకగా చీకటి పడసాగింది. నడక వేగం హెచ్చించాడు మూర్తి. రోడ్డు బాగా లేదు. రిపేరై చాలాకాలమైంది. రోడ్డుకు రెండు వైపులా పోసిన రాళ్ళ గుట్టలవైపు విసుగ్గా చూశాడు మూర్తి. పరాకుగా నడవటంతో ఠకీమని ఎదురు దెబ్బ తగిలింది. వ్రేలి నరాలు జివ్వున లాగాయి. ఆ వార్డు కౌన్సిలర్‌మీద మండిపడ్డాడు మూర్తి. ఎన్నాళ్ళకూ ఆ రోడ్డు రిపేరు సంగతి పట్టించుకోడు గదా! కౌన్సిలు ఏం చేస్తూంది?

కొంచెం దూరం పోగానే రోడ్డు పక్కన ఉన్న రాళ్ళ గుట్టను లారీలోకి తరలిస్తున్న జనం కనిపించారు.

"ఏమిటి సంగతి?" అని అడిగాడు మూర్తి మేస్త్రిని.

"ముందు ఆ పక్కన రోడ్డు వేస్తున్నా రండి" అన్నాడు మేస్త్రి.

వెంటనే రాజకీయాలు అవగతమైనాయి మూర్తికి.

ఏం చేస్తున్నారు ఆ వార్డు ప్రజలు? ప్చ్. లాభంలేదు. అందరూ మన్ను తిన్నపాములు. విసుక్కున్నాడు మూర్తి. ఏం చేసినా చూస్తూ ఊరుకుంటారు, తమకు సంబంధం లేదన్నట్టు. ఒక్కడూ ఈ అన్యాయాన్ని ప్రతిఘటించడేం!

రోడ్డుపక్క మైదానంలో ఏదో సభ జరుగుతూంది. ఉపన్యాసకుడి మాటలు లౌడ్‌స్పీకర్ లోంచి జమాయించి వినిపిస్తున్నాయి. పాఠ్య పుస్తకాల జాతీయాకరణాన్ని నిశితంగా విమర్శిస్తున్నాడు ఉపన్యాసకుడు. మూర్తి ఆ ఉపన్యాసాన్ని మెచ్చుకుంటూ ముందుకు నడిచాడు. ఎవరో బాగా తూర్పార పడుతున్నారు. తను అతనితో ఏకీభవిస్తాడు. నిజానికి తనకుగల అభిప్రాయాల వంటివి ఎవరైనా వెలిబుచ్చుతారేమోనని జాతీయాకరణ జరిగినప్పటినుంచీ పత్రికల్లో చూస్తూనే ఉన్నాడు. ఈ ఉపన్యాసకు డెవరో ఉపయోగకరమైన సేవ చేస్తున్నాడు. మూర్తి ప్రశంసాపాత్రంగా ఆ సభవైపు చూస్తూ మలుపు తిరిగాడు.

ఎవరో ఇద్దరమ్మాయిలు సినిమాకు కాబోలు వెడుతున్నారు. వెనకాల ఆకతాయిల మూక ఒకటి అనుసరిస్తూంది. నోటికి వచ్చినట్టు వ్యంగ్యంగా వాగుతున్నారు.

ఒకడికి మరీ ఠిక్క రేగింది.

రెండుచెవులూ పట్టుకునిగుంజీలుతీయిస్తే ఎవడో ఆ పని చేస్తేగాని, వాడికి బుద్ధిరాదు. నైతిక స్థాయి ఎంత దిగజారిపోతూంది! గతితప్పి నడుస్తూంది సంఘం.

ఆరె—ఎవరో తను అనుకున్నంత పనీ చేశాడు. కాలికి బుద్ధి చెబుతున్నారు ఆకతాయి ముఠాదారులు. ఆ కుర్రవాడి చెవులు నులిమేస్తున్నాడు.....ఎవరో—బహుశా సి. ఐ. డి. అయి ఉండవచ్చు.

మూర్తికి సంతృప్తిగా ఉంది. తగిన శాస్తి జరిగిం దనుకున్నాడు. సినిమా విషయం జ్ఞప్తికి వచ్చి గబ గబ అడుగులు వేశాడు.

థియేటర్ చేరువైంది.

బుకింగ్ ఆఫీస్‌దగ్గర జనం విరగ తొక్కుకుంటున్నారు. ఉన్నట్టుండి జనం అందరూ వెనక్కు విరుచుకుపడ్డారు.

బుకింగ్ ఐపోయిందట.

మూర్తికి నిరాశ కలిగింది. ఇంత దూరమూ వచ్చి, సినిమా చూడకుండా వెనక్కువెళ్ళటం



అతనికి ఇష్టంలేదు. మరో చిత్రం చూద్దామంటే మంచి దేమీలేదు.

"టిక్కెట్ కావాలా సార్?" ఎవరో కుర్రాడు మూర్తి నడిగాడు.

మూర్తి ముఖం వికసించింది.

"ఫస్ట్ క్లాసేనా?"

"అవును సార్."

"కావాలి."

"రెండున్నర సార్."

మూర్తికి ఒళ్ళు మండింది. ఎవరో అక్కర్లేక అమ్ముతున్నాడని అనుకున్నాడు. కాని ఇలా బేరంకోసం కాచుకు కూచున్నా డనుకోలేదు.

"అక్కర్లేదు" అన్నాడు.

ఆ కుర్రవాడు వెళ్ళిపోయాడు. మరొక డెవరో అడిగాడు. అతనూ అంతే. మూర్తికి అర్థమైంది. బ్లాక్ మార్కెట్ జరుగుతూంది. పోలీసువాళ్ళు ఏం చేస్తున్నట్టు? మూర్తికి పోలీసువాళ్ళమీద ఎనలేని కోపం కలిగింది. ఇలా బ్లాక్‌లో టిక్కెట్లు అమ్ముతుంటే ఎవడూ రిపోర్టు చెయ్యడేం?

మొదటి గంట కొట్టారు.

పిక్చర్ ప్రారంభం కాబోతూంది. టికెట్ దొరక్కుండా వెనక్కు తిరిగి రావలసి వస్తుందని మూర్తి అనుకోలేదు. సినిమా చూడాలని కోరిక, పట్టుదల కలిగాయి.

"మూడు రూపాయలు, సార్" అన్నాడు ఒకడు మూర్తి దగ్గరికి వచ్చి ఫస్ట్‌క్లాస్ టిక్కెట్టు చూపిస్తూ.

"మూడుంబావలా ఇస్తాను, ఇలా ఇవ్వు" అన్నా డెవరో చప్పున అక్కడికి వచ్చి.

మూర్తి తెల్లబోయాడు.

"మూడున్నర" అప్రయత్నంగా అన్నాడు.

ఆ కుర్రవాడు మూర్తికి టిక్కెట్టు అమ్మేశాడు.

థియేటర్‌లో రెండో గంట మోగుతుండగా త్వరత్వరగా మూర్తి మొదటి తరగతి వరసలోకి ప్రవేశించాడు. ★